371) వరాళి

ప॥ ఐనదయ్యా గానిదెల్లా నటు గాకుండితేమానీ। మానుపరా దివి హరిమాయామహిమలు॥

చ॥ పుట్టేటి వెన్ని లేవు పోయేటివెన్ని లేవు।వెట్టిదెహాలు మోచినవెడజీవులు।
గట్టిగా దెలుసుకొంటే కలలోనివంటి దింతే।పట్టి ఇందుకుగా నేల బడలేమో నేము॥

చ॥ కడచిన వెన్ని లేవు కాచుకున్నవెన్ని లేవు।సుడిగొన్నతనలోనిసుఖదుఃఖాలు।
యెడపుల నివి రెండు యెండనీడవంటి వింతే।కడనుండి నేమేలకరగేమో నేము॥

చ॥ కోరినవి యెన్ని లేవు కోరగలవెన్ని లేవు।తీరనిసంపదలతో తెందేపలు।
ధారుణి శ్రీవేంకటేశుదాసులమై యిన్ని యును।చేరి కైకొంటిమి యేమిసేసేమో నేము॥